## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.
- పేదరికం లేని సమాజం, కూటమి ప్రభుత్వ విధానమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.
- ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలకమైనదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు.
- రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని అమరావతిలోని భారత వాతావరణ విభాగం వెల్లడించింది.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లు పాల్గొని మహిళలతో కలిసి గుంటూరు జిల్లా ఉండవల్లి నుండి తాడేపల్లిలోని భారతమాత విగ్రహం, వారధి మీదుగా విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ వరకు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మహిళా ప్రయాణికులతో మాట్లాడి వారి రోజువారీ ప్రయాణ అవసరాలు, కుటుంబ జీవనోపాధికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు ఉండవల్లి నుంచి విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ వరకూ RTC సిబ్బంది జీరో ఫేర్ టికెట్ లను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి వీలుగా స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించామని పేర్కొంటూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

పేదరికం లేని సమాజం కూటమి ప్రభుత్వ విధానమని సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆయన ఏలూరులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం పీ4 కార్యక్రమం ద్వారా వెనుకబడిన కుటుంబాలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో 75 వేల 871 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, ఇప్పటివరకు 68 వేల 268 కుటుంబాలను 7వేల 675 మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. నదుల అనుసంధానంలో కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

===================

అమరావతిలోని రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల

గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్యం, స్వపరిపాలన  భారతీయుల జన్మహక్కు అంటూ అనేక మంది యోధులు స్వాతంత్య్ర సాధన కోసం పోరాడారని అన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి వలస వాదుల పాలన నుండి భారతదేశానికి విముక్తి కలిగించారన్నారు. వారి దేశభక్తి, జాతీయవాదం భావి తరాలవారికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆ మహానుభావుల అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి పునరంకితం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలకమైనదని పేర్కొంటూ.. వివిధ సమస్యలను, వివాదాలను న్యాయవ్యవస్థ ఎంతో సమర్ధవంతంగా పరిష్కరిస్తోందని చెప్పారు.

===================

విశాఖపట్నం నగర పాలక సంస్థలో 79వ స్వాత్రంత్య దినోత్సవ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.. కార్పొరేటర్లు, అధికారులతో కలిసి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛను గౌరవించడం, భవిష్యత్తుకు స్ఫూర్తినివ్వడం అనే పిలుపును మన భారతదేశం సూచించిందని... అందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ నగర అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ప్రజలకు, అధికారులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

===================

విరామం

===================

79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఘనంగా జరిగాయి. అమలాపురంలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో జరిగిన పెరేడ్‌లో కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని, జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గడచిన సంవత్సర కాలంలో కోనసీమ జిల్లా సాధించిన ప్రగతిని వివరిస్తూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

అనంతరం.. మంత్రి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, ప్రతిభ కనబరచిన బృందాలకు పురస్కారాలను అందజేశారు. అలాగే.. వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులకు వారి పనితీరు ఆధారంగా సాధించిన పురస్కారాలను అందచేశారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వేడుకలలో పాల్గొని రాష్ట్ర, జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ అన్ని వర్గాలకు సమున్నత స్థానం కల్పించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

===================

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా కోర్టు భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా ఈరోజు ప్రారంభించారు. సిబ్బంది, కక్షిదారులు, న్యాయవాదులు కోర్టు ఆవరణలో సులభంగా వైద్య సేవలు పొందేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వేలాది మంది కక్షిదారులు.. న్యాయవాదులు.. ప్రతీరోజు కోర్టుకు వస్తుంటారని వారిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

===================

దక్షిణ ఒడిశా - ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలు, వాయువ్య- పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్ర అధికారులు తెలిపారు. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తువరకు విస్తరించి ఉందని పేర్కొన్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలో కొన్నిచోట్ల ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా  ఉరుములతో కూడిన జల్లులు కురిసే

అవకాశముందని పేర్కొన్నారు. అలాగే ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40 నుంచి 50 కిటోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...28 సెకన్లు)

===================

రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లో స్త్రీశక్తి పథకాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తూ పాలన కొనసాగిస్తున్నామన్నారు.

===================

===================